క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



ఉక్కు వినాయక ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో బుధవారం సాయంత్రం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన హోమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

గాజువాక హైస్కూల్‌కు బయో టాయిలెట్ల వితరణ



బయో టాయిలెట్లను ప్రారంభిస్తున్న మంజునాథ్ రామ్ తదితరులు

గాజువాక : మంత్రి సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, వెసువియెస్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సంయుక్తంగా గాజువాక హైస్కూల్‌కు నాలుగు బయో టాయిలెట్లను అందజేశారు. ఈ టాయిలెట్లను ఆ సంస్థ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) మంజునాథ్ రామ్ ప్రారంభించారు. గర్ల్ ఆన్ టాప్ ప్రాజెక్టు కింద తాము ఈ టాయిలెట్లను హైస్కూల్‌లో ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెసువియెస్ జనరల్ మేనేజర్ వివేక్ నాయుడు, హెచ్‌ఆర్ హెడ్ రాజేష్ గొలగాని, హెచ్‌ఆర్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, ట్రస్టు ప్రతినిధి ప్రశాంతి, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని టి.విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న పల్లా చినతల్లి

అక్కిరెడ్డిపాలెం: పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ పల్లా చినతల్లి అన్నారు. నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సెంటు స్థలం పొందిన లబ్ధిదారులకు జీవీఎంసీ 67వ వార్డు పరిధిలోని సచివాలయం వద్ద బుధవారం రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో మొత్తం 1800 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని తెలిపారు. అందులో ఇప్పుడు 200 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశామన్నారు. మిగిలిన వారికి కూడా పట్టాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేష్‌కుమార్, పల్లా పెంటారావు, త్రినాథ్, బుజ్జి, జయేశ్వరరావు, కామునాయుడు పాల్గొన్నారు.

రెండో రోజు కేంద్ర బలగాల కవాతు



కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ రమణ తదితరులు

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ పిన్నంటి రమణ కోరారు. కేంద్ర పారా మిలటరీ దళాలతో ఫ్లాగ్ మార్చ్ రెండో బుధవారం కూడా నిర్వహించారు. అసకపల్లి, గొల్లలపాలెం,వెదుళ్లనరవ తదితర గ్రామాల మీదుగా కవాతు సాగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించనున్నట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వైభవం చారిత్రక ప్రాభవం

అప్పికొండ పుణ్య క్షేత్రం



ఆహ్లాదకరంగా అప్పికొండ తీరం





ఆధ్యాత్మిక వైభవానికి సాక్ష్యంగా నిలిచే ఆలయాలు అక్కడక్కడా మనకు కనిపిస్తుంటాయి. వాటిలోనూ చారిత్రక ప్రాశస్త్యం కలిగినవి కొన్ని ఉంటాయి. అలా.. ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తున్న ఆలయమే అప్పికొండ సోమేశ్వరాలయం. కపిల ముని తపస్సుతో ఉద్భవించిన శివలింగాలతో మహిమాన్వితంగా అలరారుతోంది ఈ క్షేత్రం. సముద్ర తీరాన ఆహ్లాదకర వాతావరణంలో వెలసిన ఈ ఆలయం ఈ నెల 8న శివరాత్రి సందర్భంగా అందరికీ ఆహ్వానం పలుకుతోంది.

- పురాతన ఆలయాల్లో దేశంలోనే మూడో దేవస్థానం
- సోమేశ్వర ఆలయానికి 900 ఏళ్ల చరితం
- శివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధం

గాజువాక/ పెదగంట్యాడ: ఆహ్లాదకర సాగర తీరం.. సమీపంలోనే ఆధ్యాత్మిక, చారిత్రక శోభతో అలరారుతున్న ఆలయమే అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయం. పెదగంట్యాడ మండలంలోని ఈ ఆలయం ఎంతో ప్రాశస్త్యాన్ని పొందింది. ద్రవిడ సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్న ఈ ఆలయాన్ని పశ్చిమ చాళుక్యులు నిర్మించారని పరిశోధకుల అంచనా.

కపిల మహర్షి తపఃఫలంతో..

పురాణాల ప్రకారం.. సముద్ర తీరంలో ముక్కోణపు ఆకారంలో ఉండే ఇక్కడి కొండను కపిల మహర్షి తపస్సుకు ఎంచుకుని, ఆ కొండకు కపిల కొండలని నామకరణం చేశారు. కపిల మహర్షి తపోదీక్ష ఆరంభించి సూర్యాస్తమయం మొదలు సూర్యోదయం లోపు నూటొక్క శివలింగాలను స్థాపించాలని సంకల్పించారు. అలా తదేక ధ్యానంలో ఉండి, తపఃశక్తిని ధారపోయడంతో లింగోద్భవ సమయం నుంచి శివలింగాలు ఉద్భవించడం ప్రారంభమై, నూరు లింగాలు ఉద్భవించే సమయానికి తెల్లవారిపోయిందట. ముని ఈ క్షేత్రానికి ఒక లింగం అప్పుగా ఉన్నందున నాటి నుండి అప్పుకొండగా .. కాల క్రమేణా 'అప్పికొండ'గా పేరుగాంచి, భక్తులను ఆకర్షిస్తోంది.



ద్వారానికి ఇరువైపులా ఆకట్టుకుంటున్న శిల్పాలు

ఆకట్టుకునే శిల్ప సంపద

సోమేశ్వరాలయంలో శిల్ప సంపద, శిలా శాసనాలు గత ప్రాభవానికి సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. భక్తులను ఆకట్టుకునే అద్భుత శిల్ప సంపద సోమేశ్వర ఆలయ ప్రాంగణంలో నేటికీ చెక్కుచెదరలేదు. ఇక్కడ వెలసిన శివలింగాలు, ఆకట్టుకునే అతి పెద్ద నల్లరాతి శిల్పాలు, చోళుల శిలాశాసనాలు, మహానంది, ప్రశాంత సముద్ర తీర ప్రాంతం, సముద్రంలోని కొండలపై డచ్ కాలంనాటి స్థూపాలు, శిల్పాలు గత ప్రాభవానికి ప్రతీకగా నిలుస్తాయి. నూట పది అడుగుల వైశాల్యంతో పూర్తిగా రాతితో ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పికొండ సోమేశ్వర ఆలయం గత మూడు దశాబ్దాలుగా బహుళ ప్రచారంలోకి వచ్చింది. ఇసుక మేటల కింద దాగివున్న కొన్ని శిలాఫలకాలు కూడా స్థానికుల తవ్వకాల్లో బయట పడ్డాయి. దీన్ని పురావస్తుశాఖ గమనించి మార్పు చేయకుండా ఉంచింది. ఇంకా ఆలయ పరిసర ప్రాంతాల్లో 17వ శతాబ్దపు విశేషాలు కూడా కనిపిస్తున్నాయి. డచ్చివారు ఈ ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకొని తమ నౌకలకు సూచికలను ఇక్కడి కొండపై ఏర్పాటు చేయడం కనిపిస్తుంది. కళా నైపుణ్యానికి అద్దం పట్టే ఇంతటి విశిష్టతను కలిగిన అప్పికొండ సోమేశ్వర ఆలయం ఉత్తరాంధ్రలో ఇప్పుడు ప్రాచుర్యం పొందుతోంది. చరిత్రకారులు చెబుతున్న వివరాల ప్రకారం క్రీస్తుశకం 973–1138 మధ్య కాలంలో చోళులు కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాలో కళ్యాణి ప్రాంతాన్ని రాజధానిగా చేసుకొని పాలన సాగించారు. ఆ కాలంలో వారు అనేక చారిత్రాత్మక కట్టడాలను నిర్మించారు. అందులో అప్పికొండ దేవాలయం కూడా ఒకటని చరిత్రకారులు ధ్రువీకరిస్తున్నారు. అనంతర కాలంలో చాళుక్యుల నిర్మాణానికి నిదర్శనంగా అప్పికొండలో కొన్ని శిలావిగ్రహాలు నేటికీ నిలిచి ఉన్నాయి. ముఖమండప ప్రాంగణంలో సర్వసేనాని మార్తాండయ్య, మంత్రి మాచవయ్య ద్వారం ఇరువైపులా చెక్కించిన శిలాశాసనాలు భక్తుల దృష్టిని ఆకర్షిస్తాయి.

శివరాత్రికి సర్వం సిద్ధం

మహా శివరాత్రిని పురస్కరించుకుని లక్షలాదిగా తరలి రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో సర్వం సిద్ధం చేశారు. సాగరతీరంలోనే ఆలయం ఉండటంతో భక్తులు తెల్లవార్లు ఇక్కడ జాగరణ చేసి, సూర్యోదయ సమయంలో సముద్ర స్నానాలు ఆచరించి, ఆపై స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తారు. ఇందుకు అనుగుణంగా దేవాదాయ శాఖ ఈవో జగన్నాథం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానుండడంతో, దేవదాయ శాఖ, జీవీఎంసీ, పోలీసు, రెవెన్యూ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

రాత్రంతా సందడే..

దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో వచ్చే భక్తులు శుక్రవారం సాయంత్రం నుంచి మరుసటి రోజు వరకు ఇక్కడే ఉంటారు. రాత్రంతా సందడి చేస్తారు. తీర్థంలో ఏర్పాటు చేసిన దుకాణాలతో ఈ ప్రాంతం కళకళలాడుతుంది.

50 బస్సులు.. 100 ట్రిప్పులు

అప్పికొండ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 50 బస్సులను, 100 ట్రిప్పులుగా నడుపుతోంది. గాజువాక, కూర్మన్నపాలెం, దువ్వాడ, అగనంపూడి తదితర ప్రాంతాల నుంచి సర్వీసులు ఉంటాయి.

5 గంటల నుంచి దర్శనాలు

ఈ నెల 8న వేకువజామున 5 గంటలకు స్వామికి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం నుంచి భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

చారిత్రక ప్రాశస్త్యం

భారతదేశంలో గల అతి పురాతన దేవాలయాల్లో ఇది మూడోదని చెబుతారు. మొదటిది కాశీలో విశ్వేశ్వరస్వామి దేవాలయం కాగా, రెండోది రామేశ్వరంలోని శ్రీరామాలయం' అని చెబుతారు. ఏటా కార్తీక మాసంలో ప్రతీ సోమవారం ఇక్కడ నిష్ఠగా శివపూజలు నిర్వహిస్తారు. శివరాత్రికి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మరెక్కడా లేని విధంగా ఇక్కడ ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవానికి జిల్లాలోని అనేక ప్రాంతాలనుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. వేలాదిమంది భక్తులు శివమాలను ధరించి తమ దీక్షను శివరాత్రి రోజు ముగిస్తారు. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు.

పుణ్యస్నానాలకు తీరం సిద్ధం

సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అప్పికొండ తీరాన్ని శుభ్రం చేశారు. ఇసుక దిబ్బలను జేసీబీతో చదును చేయించారు. అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలను కేటాయించారు. భక్తుల కోసం ప్రత్యేకంగా స్నానపు గదులు, మొబైల్ టాయిలెట్లు, దుస్తులు మార్చుకునేందుకు అనువుగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. జీవీఎంసీ అధికారులు తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో భక్తుల కోసం 70 మంది గజ ఈతగాళ్లను నియమించారు. స్టీల్‌ప్లాంట్, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల నుంచి 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 108 వాహనంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

– జగన్నాథం, ఈవో, అప్పికొండ సోమేశ్వరస్వామి దేవస్థానం

భూ తగాదాల ప్రత్యేక డ్రైవ్‌కు స్పందన

- దువ్వాడ పీఎస్ పరిధిలో 22 మంది ఫిర్యాదు
- న్యూ పోర్టు పోలీస్ స్టేషన్‌లో 5
- స్టీల్‌ప్లాంట్ పరిధిలో 1 నమోదు

కూర్మన్నపాలెం: భూకబ్జాలు, భూతగాదాలపై నిర్వహించిన ప్రత్యేక స్పందనలో పలు ఫిర్యాదులు అందాయి. భూ కబ్జాలు, తగాదాలపై అధిక ఫిర్యాదులు వస్తుండటంతో సీపీ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక స్పందన నిర్వహించారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్షయగ్రాండ్‌లో డీసీపీ–2 మేకా సత్తిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమితో ఎటువంటి సంబంధం లేని కొంతమంది ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి అసలు భూయజమానులను బెదిరించి కబ్జాలకు పాల్పడుతుండడంతో భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా గాజువాక మండలంలోని కూర్మన్నపాలెం పరిధిలో ఇటువంటి కబ్జాలు అధికంగా ఉన్నాయని, భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరించారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 22 మంది భూబాధితులు తమ భూములు కబ్జాలకు గురైనట్లు ఫిర్యాదు చేసినట్లు డీసీపీ మేకా సత్తిబాబు తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలతో భూకబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని, గొడవలకు, దౌర్జన్యాలను పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల నుండి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీసీపీ–2 మేకా సత్తిబాబు



హాస్పిటల్ నుంచి నేరుగా వచ్చిన ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు సేకరిస్తున్న డీసీపీ–2 సత్తిబాబు

న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో..

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన భూ కబ్జాలపై ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి స్పందన లభించింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ మండల పరిధిలో జరిగిన భూ కబ్జాలపై మొత్తం 5 ఫిర్యాదులు అందాయని ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు తెలిపారు. వియ్యపువానిపాలేనికి చెందిన వియ్యపు దేముడు అనే వ్యక్తి తనకు చెందిన స్టీల్‌ప్లాంట్ ఆర్ నెంబర్ స్థలం కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశారు. అలాగే దువ్వాడ సోమేశ్వరరావు అనే వ్యక్తి తనకు సుందయ్యకాలనీలో 300 చదరపు గజాల తన స్థలం ఉందని ఆ స్థలాన్ని అన్నవరం అనే వ్యక్తి కబ్జా చేయించాడని ఫిర్యాదు అందజేశారు. అలాగే, కొండి అప్పలరెడ్డి అనే మల్కాపురం గ్రామానికి చెందిన వ్యక్తికి చెందిన స్థలాన్ని అందులో ఉన్న షెడ్డును తొలగించి తిప్పల నితీష్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడని ఫిర్యాదు చేశారు. వియ్యపువానిపాలేనికి చెందిన వేమూరి శ్రీనివాసరావుకు చెందిన ఖాళీ స్థలాన్ని వియ్యపు దేముడు అన వ్యక్తి ఆక్రమించాడని ఫిర్యాదు అందింది. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ కోనవానిపాలెం శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఫిర్యాదు అందజేసింది.



న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో భూ కబ్జాపై ఫిర్యాదు స్వీకరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏడీసీపీ శ్రీనివాస్

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఉక్కునగరానికి చెందిన దంపతులు ఫిర్యాదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ టి. త్రినాథ్ నేతృత్వంలో సీఐ వి. శ్రీనివాసరావు బుధవారం స్పందన నిర్వహించారు. ఉక్కునగరానికి చెందిన డాక్టర్ వెంకటాచలం, సరస్వతి దంపతులు తాము ఎస్.కోటలో స్థలం కొనుగోలుకు సంబంధించి రూ. 15 లక్షలు అడ్వాన్స్ ఇచ్చామని, దానికి సంబంధించి రాత పూర్వకంగా పత్రం తీసుకున్నామని తెలిపారు. అయితే ఆ స్థలం రిజిస్ట్రేషన్‌కు సదరు అమ్మకందారుడు ముందుకు రాకపోవడంతో, వారు ఫిర్యాదు ఇచ్చారని సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని తెలియజేశారు.

గాజువాకలో 15 ఫిర్యాదులు

గాజువాక : నగర పరిధిలో కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగా పోలీసులు బుధవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీసీపీ శ్రీనివాస్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో తమకు 15 మంది నుంచి ఫిర్యాదులు అందినట్టు ఏడీసీపీ తెలిపారు. వాటిని పరిశీలించి సరైన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు యువ ఉద్యోగుల 'తాలి బజావో'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ ఉద్యోగులు వేతన సవరణపై మరోసారి గళం ఎత్తుతున్నారు. ఇందు కోసం తాలి బజావో కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఉక్కు కార్మికులకు 2017 జనవరి 1 నుంచి వేతన సవరణ జరగలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న యువ ఉద్యోగులు సత్వర వేతన సవరణ కోసం కార్మిక సంఘాలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ ఫలితం రాకపోవడంతో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఉక్కు ఎల్‌డీసీ విభాగం నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం

కూర్మన్నపాలెం : కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత ఉద్దేశంతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలనే ఆలోచనలు చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు బలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1119వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు, నిర్వాసితులకు అన్యాయం చేసే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విన్నవించామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ప్రారంభం

అగనంపూడి: దేశంలో ప్రసిద్ధ శైవక్షేత్రాలను దర్శించుకునే భాగ్యాన్ని అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ కల్పించడం ఈ ప్రాంతీయుల అదృష్టమని బ్రహ్మకుమారీస్ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రాజయోగిని, బికె రజని అన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే సుప్రసిద్ధ దేవాలయాల నమూనాలను ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు ఈ ప్రాంతీయులు దర్శించుకునే అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ ఇన్‌చార్జి రాజయోగిని బికె వేణి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఏటా ఇక్కడ ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బికె సత్య, బికె విమల, బికె అపరంజి, కోఆర్డినేటర్ బికె సోమేశ్వరి, అగనంపూడి ఇన్‌చార్జ్ బికె రామకోటి తదితరులు పాల్గొన్నారు.



ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న రాజయోగిని బికె రజని

ఘోషాస్పత్రి ఏవోగా నారాయణరావు

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోష) పరిపాలనాధికారిగా నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పరిపాలనాధికారిగా పని చేసిన సన్యాసినాయుడు ఈ ఏడాది జనవరి 31న పదవీ విరమణ చేశారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నారాయణరావును పదోన్నతిపై నియమించారు. గెజిటెడ్ హోదా రావడంతో నారాయణరావును వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి కార్యాలయ సిబ్బంది అభినందించి పుష్ప గుచ్ఛం అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ (ఇన్‌చార్జి)గా సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఆయన కూడా బాధ్యతలు స్వీకరించారు.

అప్పన్నకు వైభవంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీ దళాలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేసి, శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న విమల

గాజువాక : ఉద్యమాల ద్వారా మహిళా హక్కులను పరిరక్షించుకుందామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగాజువాక జంక్షన్‌లో బుధవారం తమ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు.మహిళల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు కె.వనజాక్షి, పిల్లా సూర్యపద్మ, ఎస్.కుమారి, అప్పారి శ్రీలక్ష్మి, సుగుణ, పి.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.